సాక్షి కర్నూలు

ఆదివారం ı 11 ı ఫిబ్రవరి ı 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి ఏలూరుకు చెందిన గాజుల విజయ శనివారం రూ.1,05,116 విరాళాన్ని అందించారు.



రారమ్మని.. చదువుకోమని..

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. 8లో



క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. కర్నూలులో శనివారం రాష్ట్రస్థాయి హాకీ పోటీలను ఆయన ప్రారంభించారు. 8లో

న్యూస్‌రీల్

మెనూ కచ్చితంగా అమలు చేయాలి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డీఈఓ కె. శామ్యూల్

కల్లూరు: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో నూతన మెనూను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ ఆదేశించారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం విద్యార్థుల్లో 89 శాతం మంది పాఠశాలలో భోజనం చేస్తున్నారని తెలుసుకుని మిగతా 11 శాతం విద్యార్థులు కూడా ఇక్కడే భోజనం చేసేలా అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయుడిని, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి ఇన్‌స్పైర్

కర్నూలు సిటీ: 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ కార్యక్రమం నేడు, రేపు(ఆదివారం, సోమవారం) రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు డీఈఓ కె.శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని శ్రీరాంనగర్ శ్రీచైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందులో 163 ప్రాజెక్టులు ప్రదర్శిస్తామని, కార్యక్రమానికి అబ్జర్వర్‌గా ఢిల్లీ నుంచి ఓ ప్రతినిధి వస్తున్నారని పేర్కొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

సర్వాయిపల్లెకు చేరిన అహోబిలేశుడు

ఉయ్యాలవాడ: అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి పల్లకీ శనివారం మండలంలోని సర్వాయిపల్లె గ్రామానికి చేరుకుంది. గ్రామస్తులు, అధికారులు ఉత్సవమూర్తులకు ఎదురేగి స్వాగతం పలికారు. ఆళ్లగడ్డ మండలం ఎస్.లింగందిన్నె గ్రామం నుంచి సర్వాయిపల్లెకు చేరుకోవడంతో ఆనవాయితీ ప్రకారం గ్రామానికి చెందిన సన్నితి సుబ్రమణ్యం శ్రేష్టి గృహం నుంచి నూతన వస్త్రాలు, తాంబూలాలు మేళ తాళాలతో తెలుపు వద్దకు తెచ్చి స్వామికి పూజ నిర్వహించారు.

మెట్ట భూముల్లో జలకళ

- వైఎస్సార్ జలకళ పథకంతో 3,654 బోర్ల తవ్వకాలు
- ఇప్పటి వరకు 944 బోర్లకు విద్యుదీకరణ పూర్తి
- ఏడాదికి మూడు పంటలు పండించుకునే అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



వైఎస్‌ఆర్ జలకళ పథకం కింద వేసిన బోరులో సమృద్ధిగా పారుతున్న నీరు

కర్నూలు(అగ్రికల్చర్): మెట్టభూముల్లో జల సిరులు ఉప్పొంగుతూ రైతు కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ జలకళ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. కనిష్ఠంగా 2.5 ఎకరాల నుంచి గరిష్ఠంగా 5 ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులకు ఉచితంగా బోర్లు వేసి మెట్ట భూములకు సాగునీరు అందిస్తున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఈ పథకాన్ని అమలు చేస్తోంది. జలకళ పథకం ద్వారా ఒక్కో రైతుకు సగటున రూ.3 లక్షల నుంచి 4 లక్షల వరకు ప్రయోజనం కలుగుతోంది.

220 బోర్లకు విద్యుత్ మోటార్లు ఏర్పాటు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 944 బోర్లకు విద్యుదీకరణ పనులు పూర్తి అయ్యాయి. విద్యుదీకరణ పూర్తి చేసిన బోర్లకు ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా విద్యుత్ మోటార్లు సరఫరా చేస్తోంది. ఒక వైపు విద్యుత్ మోటార్ల సరఫరాకు ఎస్టిమేట్లు జనరేట్ చేయడం, ఆయా జిల్లా కలెక్టర్ల నుంచి పరిపాలన అనుమతులు తీసుకోవడం, వర్క్ ఆర్డర్ జనరేట్ చేసుకొని వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టడం, మోటార్ల సరఫరా, అమర్చడం వంటి పనులను జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులు ముమ్మరం చేశారు. ఇప్పటికే 728 బోర్లకు విద్యుత్ మోటార్లు అమర్చేందుకు జిల్లా కలెక్టర్లు అనుమతులు ఇచ్చారు. రూ.10.56 కోట్లతో కర్నూలు జిల్లాలో 268, నంద్యాల జిల్లాలో 460 బోర్లకు విద్యుత్ మోటార్లు సరఫరా చేసేందుకు జిల్లా కలెక్టర్లు పరిపాలనా అనుమతులు ఇచ్చారు. వీటికి విద్యుత్ మోటార్లు అమర్చే ప్రక్రియ ఊపందుకుంది. ఇప్పటికే రూ.2.72 కోట్ల వ్యయంతో కర్నూలు జిల్లాలో 105, నంద్యాల జిల్లాలో 117 పంపుసెట్లు బిగించారు. పంపుసెట్లు కళ్ల ముందు కనిపిస్తుండటంతో రైతులు ఆనందంతో పొంగిపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3,654 బోర్ల తవ్వకాలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్ జలకళ కింద బోర్ల తవ్వకాలకు రూ.34.75 కోట్లు ఖర్చు చేయడం విశేషం. ఈ నిధులతో రాజకీయాలకు అతీతంగా 3,654 మంది రైతులకు చెందిన మెట్ట భూముల్లో బోర్లు వేశారు. కర్నూలు జిల్లాలో 1,516, నంద్యాల జిల్లాలో 2,138 బోర్లు వేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 391, బనగానపల్లెలో 963, డోన్‌లో 422, నందికొట్కూరులో 179, నంద్యాలలో 53, పాణ్యంలో 121, శ్రీశైలం నియోజకవర్గంలో 66 ప్రకారం బోర్లు వేశారు. కర్నూలు జిల్లాలో ఆదోని నియోజకవర్గంలో 22, ఆలూరులో 329, కోడుమూరులో 20, మంత్రాలయంలో 117, పత్తికొండలో 680, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 291 ప్రకారం బోర్లు వేశారు.

మోటారుకు సగటు ఖర్చు రూ.1.30 లక్షలపైనే

ఒక్కో విద్యుత్ మోటారుకు ప్రభుత్వం సగటున రూ.1.30 లక్షలకుపైగా ఖర్చు చేస్తోంది. 10 హెచ్‌పీ(20టు 22 స్టేజ్) విద్యుత్ మోటారు ధర రూ.1,92,475, 7.5 హెచ్‌పీ(12టు 14స్టేజ్) ధర రూ.1,09,343, 5 హెచ్‌పీ(8 టు 10 స్టేజ్) ధర రూ.77,532 ప్రకారం ధరలు ఖరారు అయ్యాయి. బోరు తవ్విన లోతు, ఎంత లోతులో నీళ్లు ఉన్నాయనే దాని ఆధారంగా తగిన సామర్థ్యం కలిగిన విద్యుత్ మోటార్లు సరఫరా చేస్తున్నారు.

జిల్లాల వారీగా తవ్విన బోర్ల వివరాలు

జిల్లా	తవ్విన బోర్లు	ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు
కర్నూలు	1,516	103
నంద్యాల	2,138	117
మొత్తం	3,654	220

318 బోర్లకు విద్యుదీకరణ

కర్నూలు జిల్లాలో 120, నంద్యాల జిల్లాలో 138 బోర్లకు ప్రభుత్వమే ఉచితంగా విద్యుదీకరణ పనులు పూర్తి చేసింది. తర్వాత రైతులే విద్యుదీకరణ పనులు చేసుకునే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాల్లో మార్పులు చేసింది. జలకళ బోర్ల కింద గత ఏడాది నుంచే పంటలు సాగు చేసుకుంటున్నారు. వైఎస్‌ఆర్ జలకళతో సన్న, చిన్న కారు రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. విద్యుదీకరణ పనులు పూర్తి చేసుకున్న రైతులకు పంపుసెట్లు ఉచితంగా సరఫరా చేయడం, వాటిని అమర్చడం వంటి పనులన్నీ ప్రభుత్వమే చేపడుతోంది.

గతంలో ఇలా..

బోర్ల తవ్వకం ఖరీదైన వ్యవహారం కావడంతో సన్న, చిన్నకారు రైతులు వర్షాధారం పై పంటలు సాగు చేసేవారు. కొందరు ధైర్యం చేసి బోర్లు తవ్వుకుని అప్పుల పాలయ్యేవారు. బోర్లు తవ్వుకున్న తర్వాత విద్యుత్ మోటారు, ఇతర మెటీరియల్‌కు ఖర్చు తడిసిమోపెడయ్యేది. టీడీపీ హయాంలో ఐదేళ్ల తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు సరిగ్గా పండలేదు. మెట్ట భూములు బీళ్లుగా దర్శనమిచ్చేవి.

ప్రస్తుతం ఇలా..

సన్న, చిన్న కారుల రైతుల కలలు పండే విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేస్తోంది. ఉచితంగా బోర్లు తవ్వుతోంది. అంతేకాకుండా విద్యుత్ మోటారు, ఇతర మెటీరియల్‌ను కూడా ప్రభుత్వమే ఉచితంగానే అందజేస్తోంది. జలకళ బోర్లకు పంపుసెట్లు అమర్చడంతో రైతులు మూడు పంటలు పండించుకునే వెసలుబాటు లభించింది.

విద్యుత్ మోటార్లు బిగించడంపై దృష్టి



వైఎస్‌ఆర్ జలకళ కింద తవ్విన బోర్లకు విద్యుత్ మోటార్లు అమర్చడంపై దృష్టి సారించాం. బోరులో నీరు ఉన్నపుడు మోటారు ఇస్తేనే రైతుకు మేలు జరుగుతుంది. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో విద్యుత్ మోటార్లు అమర్చే పనులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 220 బోర్లకు విద్యుత్ మోటార్లు బిగించడం పూర్తి అయింది. కలెక్టర్లు ఇచ్చిన పరిపాలనా అనుమతుల మేరకు విద్యుత్ మోటార్లు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు

ప్రభుత్వం రూ.4 లక్షలకుపైగా ఖర్చు చేసింది



మాకు ఇంతవరకు నీటి సదుపాయం లేదు. దూరంగా కాల్వ ఉండటం వల్ల అతి కష్టం మీద నీరు పారించుకొని పంటలు పండించుకునే వాళ్లం. మాకు 4.17 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం వైఎస్సార్ జలకళ కింద బోరు వేసింది. బోరు వేయడంతో పాటు ప్రభుత్వమే విద్యుదీకరణ పనులు చేసింది. ఇటీవలనే విద్యుత్ మోటారు కూడా సరఫరా చేసింది. మా ఒక్కరికే ప్రభుత్వం బోరు, విద్యుదీకరణ, విద్యుత్ మోటారు తదితర వాటికి రూ.4లక్షలకుపైగా ఖర్చు చేసింది. ఇంతవరకు సాగు నీటి సదుపాయం లేక పంటలు కలసిరాక నష్టాలు మూటకట్టుకున్నాం. ప్రభుత్వ సహకారంతో బోరు లభించింది. ప్రస్తుతం బోరు కింద మిర్చి సాగు చేశాం.

– కిశోర్‌కుమార్‌రెడ్డి, ఆకుమల్ల గ్రామం సంజామల మండలం, నంద్యాల జిల్లా

మోటారు కూడా ఉచితంగా ఇచ్చారు



మాకు మూడు ఎకరాల భూమి ఉంది. రెండేళ్ల క్రితం వరకు వర్షాధారం కింద పంటలు సాగు చేస్తూ నష్టాలు మూట కట్టుకున్నాం. ప్రభుత్వం వైఎస్‌ఆర్ జలకళ కింద దాదాపు రూ.లక్షతో ఉచితంగా బోరు వేసింది. అంతేగాకుండా రూ.1.92 లక్షల వ్యయంతో 10 హెచ్‌పీ విద్యుత్ మోటారు కూడా మంజూరు చేసింది. అధికారులు వచ్చి బోరుకు మోటారు బిగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కలను నెరవేర్చారు. బోరు కింద ప్రస్తుతం మిర్చి సాగు చేశాం. పంట ఆశాజనకంగా ఉంది.

– ఆదిలక్ష్మి, దుద్ది, కోసిగి మండలం, కర్నూలు జిల్లా

జీవనోపాధుల వృద్ధికి ప్రత్యేక చర్యలు

- జిల్లాలో 20 నాటుకోళ్ల పెంపకం యూనిట్ల ఏర్పాటు
- సెర్ప్ సీఈఓ ఎండీ ఇంతియాజ్



పెరటి కోళ్ల యూనిట్లను ప్రారంభిస్తూ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సెర్ప్ సీఈఓ ఇంతియాజ్, చిత్రంలో డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ, అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): మహిళల జీవనోపాధులను మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) ఎండీ ఇంతియాజ్ తెలిపారు. శనివారం ఆయన జిల్లాలో పర్యటించారు. కృష్ణగిరి మండలం కోయిలకొండలో నాలుగు, వెల్దుర్తిలో మూడు నాటు కోళ్ల పెంపకం కేంద్రాలను ప్రారంభించారు. పౌల్ట్రీ యూనిట్లను ఏర్పాటు చేసుకున్న మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. అంతకు ముందు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ–వైకేపీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి చిన్న తరహా పెరటి కోళ్ల పెంపకం యూనిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా హిఫర్ ఇంటర్నేషనల్ సంస్థ రూపొందించిన నాటు కోళ్ల పెంపకానికి సంబంధించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు. వెల్దుర్తి, కృష్ణగిరి, కలెక్టరేట్‌ల్లో జరిగిన కార్యక్రమాల్లో సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ..డీఆర్‌డీఏ–వైకేపీ సహకారంతో మొదట పైలెట్ ప్రాజెక్టు కింద వెల్దుర్తి, కృష్ణగిరి, కల్లూరు మండలాల్లో 20 యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. యూనిట్లు నెలకొల్పుకోవడానికి రూ.40 వేల వరకు రుణ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. హిఫర్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ శ్యామ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆదోని ఏరియా డెవలప్‌మెంటు అథారిటీలో భాగంగా పెరటి కోళ్ల పెంపకంలో మహిళలు రాణించే విధంగా తమ సంస్థ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోందన్నారు. డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ సలీమ్‌బాషా మాట్లాడుతూ.. మహిళల జీవనోపాధులను మెరుగుపరుచడం లక్ష్యంగా జిల్లాలో పెద్ద ఎత్తున పెరటి కోళ్ల పెంపకాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ స్టేట్ లీడ్ సుభాష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి, జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య, డీఆర్‌డీఏ–వైకేపీ అదనపు పీడీ శ్రీధర్, డెయిరీ డీపీఎం డాక్టర్ అనిల్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సీతాబాయి పాల్గొన్నారు.

జిల్లాలో 1.36 లక్షల ఎపిక్ కార్డుల పంపిణీ



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో 2.24 లక్షల ఎపిక్ కార్డులను జనరేట్ చేశామని, అందులో 1.36 లక్షల కార్డులను ఓటర్లకు పంపిణీ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. శనివారం ఆయన విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఎన్నికల అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ సృజన వివరించారు. పెండింగ్ ఫారాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామని, కేవలం రెండు ర్యాంపులు, ఒక్క టాయిలెట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆ పనులను కూడా ఒకటి, రెండురోజుల్లోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఉద్యోగుల వివరాలను ఫిబ్రవరి 15లోపు అప్‌డేట్ చేస్తామన్నారు. హోం ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో అబ్జర్వర్‌ను నియమించినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్కు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె వివరించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే 'ఆసరా'

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్
- పొదుపు మహిళలను మోసం చేసిన చంద్రబాబు
- వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేసిన ఎమ్మెల్యే కాటసాని, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్



వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్

పాణ్యం: పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ అన్నారు. శనివారం పాణ్యంలోని బొమ్మల దేవాలయం ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. పొదుపు మహిళలను లక్షాధికారులను చేయాలనే సంకల్పంతో మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీని ప్రవేశపెట్టారన్నారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో ముందడుగు వేసి 2019 ఏప్రిల్ 11 నాటికి రాష్ట్రంలోని పొదుపు సంఘాలకు ఉన్న రుణాలను అధికారంలోకి వస్తే నాలుగు విడతల్లో తిరిగి అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేశారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి పొదుపు మహిళలను మోసం చేశారన్నారు. దీంతో రాష్ట్రంలో 30 లక్షల మంది డిఫాల్టర్లుగా మిగిలిపోయారన్నారు. సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరా కింద నంద్యాల జిల్లాలో 21,017 స్వయం సహాయక సంఘాలకు రూ.544.81 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. పాణ్యం మండలానికి సంబంధించి నాలుగో విడతలో పొదుపు సంఘాల బ్యాంక్ ఖాతాలకు రూ. 4,27,25,530 జమైందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాటసానితో కలసి ఆయన మెగా చెక్కును అందించారు. సీఎం చిత్ర పటానికి పొదుపు మహిళలు, ఎమ్మెల్యే కాటసాని పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రారమ్మని.. చదువుకోమని!

- గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ప్రతిభ చూపితే ఉత్తమ భవిష్యత్తు
- 5 నుంచి ఇంటర్ వరకు కార్పొరేట్ వసతుల మధ్య చదువులు
- దరఖాస్తుకు ఈ నెల 23 వరకు గడువు
- మార్చి 10వ తేదీన ప్రవేశ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో ఇంటర్‌లో 1,280, 5వ తరగతిలో 1,120 సీట్లు

ఆహ్లాదకర వాతావరణం.. బలవర్ధక భోజనం.. కార్పొరేటు స్థాయిలో ఆధునిక టెక్నాలజీ బోధన.. క్రీడల్లో శిక్షణ.. ఇష్టమైన రంగాల వైపు ప్రోత్సాహం.. ఇవన్నీ గురుకులం విద్యాలయాల్లోనే సాధ్యం. రూ. లక్షలు పోసి కార్పొరేటు విద్యా సంస్థల్లో చదవలేని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు గురుకులాలు వరంగా మారాయి. అత్యున్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్న ఈ పాఠశాలల్లో 2024 – 25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ప్రవేశ దరఖాస్తులు ఆహ్వానిస్తుండటంతో తమ పిల్లలను ఇక్కడ చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.



విద్యాలయంలో తరగతి గదికి వస్తున్న విద్యార్థినులు

ఆళ్లగడ్డ: పేదింట చదువుల వెలుగులు నింపుతున్న గురుకులాలు కార్పొరేట్ హంగులతో విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నాయి. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరిన తరగతి గదులు.. చుట్టూ అపరిశుభ్రత వాతావరణం.. విష పురుగుల భయం.. వసతులు కరువై విద్యార్థులు అవస్థలు పడేవారు. అలాంటి గురుకులాలు నేడు జగనన్న ప్రభుత్వ పాలనలో నాడు – నేడు పథకంలో కొత్త రూపును సంతరించుకున్నాయి. అత్యాధునికమైన ఐఎఫ్‌బీ బోర్డులతో డిజిటల్ బోధన, 10వ తరగతి నుంచే ఐటీపై శిక్షణ ఇచ్చి ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్‌లు. సీబీఎస్‌ఈ సిలబస్‌తో విద్యాబోధన. మినరల్ వాటర్ ప్లాంట్, రుచికరమైన భోజనం ఇలా వసతులు, సౌకర్యాల కోసం వందల కోట్లు ఖర్చు చేయడంతో గురుకుల పాఠశాలలు సర్వాంగ సుందరంగా మారాయి. గత ఐదేళ్లలో గురుకులాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి ఉన్నత చదువులకు బంగారు బాట వేసుకున్నారు. దీంతో తమ పిల్లలను ఇక్కడ చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. 2024 – 25 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం తరగతుల్లో ప్రవేశాల కోసం ప్రకటన వెలువడింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 14 ప్రభుత్వ సాంఘిక సంక్షేమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురకుల పాఠశాలలు ఉండగా సుమారు 8 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతి గురుకులంలో 5వ తరగతికి 80 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 80 సీట్లు భర్తీ చేయనున్నారు. కేటగిరీల వారీగా ఎస్సీలకు 70, ఎస్టీలకు 5, బీసీలకు 4, ఓసీలకు 1 సీటును కేటాయించారు. ప్రతి పాఠశాలలో ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్‌లో 80 సీట్లు భర్తీ చేయనున్నారు. ఏదైనా ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతుండాలి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి (ఇంగ్లిష్ మీడియం) చదువుతుండాలి.

ఐఐటీ, నీట్‌లలో శిక్షణ

ఇంటర్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు నీట్, ఐఐటీలలో దేనికి శిక్షణ పొందాలని అనుకుంటున్నారో ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలతో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి బాలురకు కర్నూలు జిల్లా చిన్నటేకూరు, బాలికలకు గుంటూరు జిల్లా గోరంట్ల, విజయవాడ ఈడ్పుగల్లు కళాశాలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 700 సీట్లు కేటాయించి ఇంటర్ మీడియెట్‌తో పాటు నీట్, ఐఐటీల్లో శిక్షణ ఇస్తారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన వారికి సైతం ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, మెయిన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు 10వ తరగతి నుంచి ఐటీపై శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి కోచ్‌లను నియమించారు. ఇందులో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఐటీ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది. ఈ సర్టిఫికెట్‌తో ఐటీ ఉద్యోగాల్లో చేరే అవకాశం ఉంది.

ప్రవేశ పరీక్ష తేదీ

5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు మార్చి 10వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వెబ్‌సైట్ నుంచే పరీక్ష తేదీకి వారం రోజుల ముందు నుంచే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.


ఐటీ ల్యాబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

విద్యార్థులు నెట్ సెంటర్ గానీ, సమీపంలోని ఏదైనా గురుకుల పాఠశాలల్లోగాని నమోదు చేసుకోవచ్చు. విద్యార్థి ఆధార్, పాస్‌పోర్టు ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్, తల్లి బ్యాంకు పాస్ బుక్, ఫోన్‌నెంబర్‌తో లింకైన ఆధార్‌కార్డు అవసరం. https@//apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు.

దరఖాస్తులో జాగ్రత్తలు తీసుకోవాలి



ఆన్‌లైన్‌లో దరఖాస్తు సబ్మిట్ చేసిన తరువాత మళ్లీ మార్చుకునే అవకాశం ఉండదు. సొంతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని వారు సమీపంలోని విద్యాలయానికి వస్తే అక్కడి సిబ్బంది సహకరిస్తారు. పరీక్ష రాసేందుకు వారికి సమీపంలోని విద్యాలయాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.

– సీహెచ్‌కె సంధ్యారాణి, ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, ఆళ్లగడ్డ

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ చదువుతో అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నాం. ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణలో నాణ్యమైన విద్యాబోధన ఉంటుంది. గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు అమ్మఒడి, విద్యా కానుక, ఉచిత పుస్తకాలు, యూనిఫాం అందించడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఐ.శ్రీదేవి, డీసీఓ, ఎ.పి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్

క్లుప్తంగా

బంగారుపేటలో కార్డన్ సెర్చ్


నాటుసారా స్థావరాలపై దాడులు చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కర్నూలు: స్థానిక బంగారు పేటలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ విజయ్‌శేఖర్ ఆధ్వర్యంలో శనివారం ఉదయమే వందలాది మంది పోలీసులు కాలనీని చుట్టుముట్టి విస్తృత తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సారా స్థావరాలపై పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బంగారు పేటలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి 1900 లీటర్ల నాటుసారా తయారు చేసే బెల్లం ఊటను ధ్వంసం చేసి 250 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి ఉపయోగించే ప్లాస్టిక్ బిందెలు, కుండలు నవసాగరం బెల్లం మొత్తం సీజ్ చేశారు. దాడుల్లో 2 టౌన్ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల్లో ఏప్రిల్ నుంచి ఆన్‌లైన్ లావాదేవీలు!

- ముమ్మరంగా కంప్యూటరీకరణ పనులు
- ఈ నెల 24కు పూర్తి చేసే విధంగా చర్యలు
- మార్చి నెలలో ట్రయల్‌రన్

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్‌ల్లో) లావాదేవీలన్నీ ఏప్రిల్ నెల నుంచి పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఇందుకోసం కంప్యూటరీకరణ కార్యక్రమం ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ నెల 24 నాటికి కంప్యూటరీకరణ పూర్తి చేసి మార్చి నెలలో ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 పీఏసీఎస్‌లు ఉండగా.. ఇప్పటి వరకు రెండు స్టేజీల్లో కంప్యూటరీకరణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం మూడో స్టేజ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పీఏసీఎస్‌ల్లో మొత్తం 5 లక్షల మందికిపైగా రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరి వివరాలన్నింటినీ కంప్యూటరీకరణ చేయాల్సి ఉంది. ఈ పనులను డీసీసీబీ సీఈఓ శివలీల, జిల్లా సహకార అధికారి పి.రామంజనేయులు పర్యవేక్షిస్తున్నారు. కంప్యూటరీకరణ ప్రక్రియను రూ.4 కోట్ల వ్యయంతో చేపడుతున్నారు. ఈ మొత్తంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, నాబార్డు 10 శాతం చొప్పున వెచ్చిస్తున్నాయి. కంప్యూటరీకరణతో పీఏసీఎస్‌లు బ్యాంకులుగా రూపాంతరం చెందనున్నాయి. సభ్యులుగా ఉన్న రైతులకు సంఘాల్లోనే ఖాతాలు ప్రారంభిస్తారు. పీఏసీఎస్‌లు బ్యాంకింగ్ సేవలు అందించడంతో పాటు కామన్ సర్వీస్ సెంటర్లుగా కూడా అభివృద్ధి చెందనున్నాయి.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం


హాకీ స్టిక్‌తో బాల్‌ను కొడుతూ పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య

- రాష్ట్రస్థాయి హాకీ పోటీలను ప్రారంభించిన మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో శనివారం రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీల్లో వేలాది మంది క్రీడాకారులు పాల్గొనడం శుభపరిణామమన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. నిరంతర సాధనతో విజయాన్ని సాధించవచ్చని చెపఅపరు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన హాకీ క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అంతకు ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, దాసరి సుధీర్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, రగ్బీ సంఘం అద్యక్షుడు గుడిపల్లి సురేందర్ పాల్గొన్నారు.

మొదటి రోజు హాకీ విజేతలు..

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో మొదటి రోజు విజేతల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.అనకాపల్లి జట్టు 9–1 గోల్స్‌తో అనంతపురం జట్టుపై గెలుపొందింది. పశ్చిమగోదావరి జట్టు 14–0 గోల్స్‌తో గుంటూరు జట్టుపై, శ్రీసత్య సాయి జిల్లా జట్టు 2–0 గోల్స్‌తో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించాయి. కర్నూలు జట్టు 5–0 స్కోర్‌తో కృష్ణా జిల్లా జట్టుపై, కాకినాడ జట్టు 5–1 గోల్స్‌తో శ్రీకాకుళం జట్టుపై విజయం సాధించాయి.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- ఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు బత్తుల పద్మావతి



ప్రాంతీయ సదస్సులో మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు

కర్నూలు(అర్బన్): బాలల హక్కుల పరిరక్షణలో అధికారులందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. శనివారం స్థానిక జీ పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమావేశ భవనంలో ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సమన్వయంతో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రోహిణి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ఐసీడీఎస్, బాలల సంరక్షణ విభాగాలు, కార్మిక, విద్య, పోలీసు, వైద్య ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలు, చైల్డ్ హెల్ప్‌లైన్ – 1098, స్వచ్ఛంధ సంస్థలకు చెందిన అధికారులు, ప్రతినిధులు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం జరిగిన కార్యక్రమంలో కమిషన్ సభ్యురాలు పద్మావతి మాట్లాడుతూ బాలల సంక్షేమం వంద శాతం నెరవేరాలనే ఏకైక ధ్యేయంతో పాటు సదస్సులో చర్చించిన అంశాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. సదస్సుకు హాజరైన మరో సభ్యురాలు ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి సదస్సులను ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించుకోవాలన్నారు. ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించే దిశగా ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ప్రాంతీయ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. ఈ సదస్సులో అనంతపురం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి, బాలల సంక్షేమ సమితి సభ్యులు, నాలుగు జిల్లాల డీసీపీఓలు, ఎస్ఎస్ఏ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో బాలల హక్కుల పరిరక్షణ, వారి సంరక్షణ, చట్టాలు తదితర అనేక అంశాలను సంబంధిత శాఖలకు చెందిన అధికారులతో చర్చించారు.

చర్చించిన అంశాల్లో కొన్ని ...

- ఇటీవలి కాలంలో నాలుగు ఉమ్మడి జిల్లాల్లో నమోదైన బాల కార్మిక కేసులు, వీరికి ప్రభుత్వం అందిస్తున్న మ్యాచింగ్ గ్రాంట్‌పై చేపట్టిన చర్యలు, లబ్ధి పొందిన వారి వివరాలను ఆరా తీశారు.
- రెండేళ్లగా జరిగిన బాల్య వివాహాలు, నమోదైన కేసులు, ఎంత మంది బాలికలను తిరిగి పాఠశాలల్లో చేర్పించారు.. పోక్సో కేసులు ఎన్ని నమోదు చేశారు ? ఆయా కేసుల్లో జన్మించిన పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు.
- కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో బాలల హక్కుల ఉల్లంఘనలు ఏ రూపంలో జరుగుతున్నాయి? సంబంధిత శాఖలు వీటిని ఎలా అధిగమిస్తున్నారనే విషయాలపై అధికారులతో మాట్లాడారు.
- గిరిజన ప్రాంతాల్లోని వివిధ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న మెనూ, పరిశుభ్రత, ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ సహకారాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

శ్యాంబాబు.. పద్ధతి మార్చుకో

- మహిళలను గౌరవించకపోతే రాజకీయ సమాధి తప్పదు
- జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి

కృష్ణగిరి: మహిళలను గౌరవించకపోతే పత్తికొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబుకు రాజకీయ సమాధి తప్పదని జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి హెచ్చరించారు. కృష్ణగిరిలో శనివారం పత్తికొండ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, మండల కో–ఆప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా, పార్టీ నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన కృష్ణగిరిలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో శ్యాంబాబు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిపై అనుచిత వాఖ్యలు చేయడం తగదన్నారు. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో మహిళలే ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. గతంలో శ్యాంబాబు కుటుంబసభ్యులు కురువ, వాల్మీకి, ఇతర కులస్తులపై దాడులు చేశారన్నారు. పత్తికొండ నియోజవర్గంలో ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో బహిరంగా చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి, నాయకులు సుభాష్, నాగరాజు, హుసేన్‌సాహెబ్, రామచంద్రుడు, బాలమిన్నెల్ల, గోవిందురాజులు, శంకరయ్య, సుంకన్న, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేలుకాటుతో విద్యార్థినికి అస్వస్థత

పగిడ్యాల: లక్ష్మాపురం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని లాస్య శనివారం రాత్రి తేలుకాటు బారిన పడి అస్వస్థతకు గురైంది. భోజనానంతరం డార్మెటరీకి వెళ్తున్న లాస్యను తేలుకాటు వేసింది. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించగా స్టాఫ్ నర్సు కరుణమ్మ ఇంజెక్షన్‌లు వేసి నందికొట్కూరు సీహెచ్‌సీకి రెఫర్ చేశారు. కాగా విద్యార్థిని తేలుకాటుకు గురైన సమయంలో గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, హెల్త్ సూపర్‌వైజర్ అందుబాటులో లేరని తెలుస్తోంది.